కురిసింది.. కుండపోత

- పొంగి ప్రవహించిన వంకలు, వాగులు
- వేదవతి హగిరిలో పరవళ్లుతొక్కిన వరద
- నీటమునిగిన వేరుశనగ,కంది, మిరప పంట
- రైతులకు అపార నష్టం
- కణేకల్లు-ఉరవకొండకు రాకపోకలు బంద్
- 94 ఎంఎం వర్షపాతం నమోదు

కణేకల్లు: కణేకల్లు మండలంలో కుండపోత వర్షం కురిసింది. వంకలు, వాగులు పొంగి ప్రవహించాయి. మండల వ్యాప్తంగా అన్నిచోట్ల భారీ వర్షం కురిసింది. వర్షపాతం 94 ఎంఎంగా నమోదైంది. బుధవారం రాత్రి 11 గంటల నుండి గురువారం వేకువజాము వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. సొల్లాపురం, హనకనహళ్, కళేకుర్తి, మాల్యం, కణేకల్లు తదితర గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి వేదవతి హగిరి ఉగ్రరూపం దాల్చింది. వేదవతి హగిరిలో వరదనీరు పరవళ్లు తొక్కాయి. కణేకల్లు-మాల్యం మార్గంమధ్యలో వేదవతి హగిరిలో తాత్కాలికంగా వేసిన రోడ్డు పైకి భారీ స్థాయిలో వరదనీరు రావడంతో కణేకల్లు-ఉరవకొండ బస్సుల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ఉరవకొండ నుంచి కణేకల్లుకు వచ్చే బస్సులన్నీ మాల్యం వరకు వచ్చి అటు నుంచి అటే వెళ్తున్నాయి. గరుడచేడులో సాగు చేసిన వేరుశనగ పంట పొలాల్లోకి వరదనీరు చేరడంతో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. 70 ఎకరాల్లో సాగు చేసిన వేరుశనగ పంట జల దిగ్బంధంలో ఉండిపోయింది. వేరుశనగ పంట చేతికి రావడంతో రైతులు గుంటక తోలి (చేయించి) మరో రెండ్రోజుల్లో కూలీలను పెట్టి కోత చేయిద్దామనుకున్నారు.

దెబ్బతిన్న పంట పొలాలు..

భారీ వర్షం రావడంతో పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. వెంకటరాముడు, బ్రహ్మన్న, రామయ్య, వన్నూరుస్వామి, నాగప్ప, మరికొందరు రైతులు వేరుశనగ పంట దెబ్బతినింది. కొందరు పంట కోత చేసి నూర్పిడి చేయాలనుకున్న సమయంలో వర్షం రావడంతో పూర్తిగా తడిసిపోయింది. బెణికల్లు-ఎస్ఆర్ఎన్‌క్యాంపు మార్గమధ్యంలో ఉన్న వంకకు వరదనీరు రావడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. హనకనహళ్-సొల్లాపురం, హనకనహళ్ -బెలుగుప్ప మార్గంమధ్యలో వంకకు భారీగా వరదనీరు వచ్చింది. గ్రామానికి ఇరువైపులా వంకలకు వరద రావడంతో ప్రజలు ఊరు దాటి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం 2.30 గంటలకు వరదనీరు తగ్గడంతో ప్రజలు బెలుగుప్ప, కణేకల్లుకు వెళ్లారు.

బొమ్మనహాళ్: మండలంలో బుధవారం రాత్రి నుంచి భారీ ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. 27.2 ఎం.ఎం వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి వేదావతి హగరి నదికి భారీగా వరద నీరు వచ్చాయి. ఉద్దేహాళ్, ఉప్పరహాళ్ క్రాస్, లింగదహాళ్, కొలగానహళ్లి గ్రామాల వద్ద వరి పంట నీట మునిగింది. కొలగానహళ్లి సమీపంలో కబ్బాలి వంకకు భారీగా వరదనీరు ఉధృతంగా పారింది. ఉద్దేహాళ్‌లోని హైస్కూల్, సినిమా థియేటర్ మైదానంలోకి భారీగా వర్షపు నీరు వచ్చింది. పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ సాయికుమార్ తెలిపారు.



కణేకల్లు-మాల్యం మధ్య వేదవతి హగిరిపై ప్రవహిస్తున్న వరదనీరు



గరుడచేడులో నీటమునిగిన వేరుశనగ పంట

రాత్రంతా జడివాన

రాయదుర్గంటౌన్: రాయదుర్గం నియోజకవర్గంలో మోస్తరు నుంచి భారీ వర్షం నమోదైంది. బుధవారం రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. అత్యధికంగా కణేకల్లులో 9.4 సెంటీ మీటర్లు, డి.హీరేహాళ్‌లో 3.7 సెంటీమీటర్లు, బొమ్మనహాళ్‌లో 2.7 సెంటీమీటర్లు, రాయదుర్గంలో 1.6 సెంటీమీటర్లు, గుమ్మఘట్టలో అత్యల్పంగా 4.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాయదుర్గంలో ఎడతెరిపి లేకుండా జడివాన కురవడంతో పట్టణంలోని రోడ్లు బురదమయంగా మారాయి. మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లే ప్రవేశం వద్ద బురదమయంగా మారింది. వీరాపురం సమీపంలో రెండు భారీ వృక్షాలు నేలకూలాయి. రాయదుర్గం-కణేకల్లు మార్గంలో బస్సుల రాకపోకలు స్తంభించాయి.

డి.హీరేహాళ్‌లో భారీ వర్షం

డి.హీరేహాళ్(బొమ్మనహాళ్): డి.హీరేహాళ్ మండల వ్యాప్తంగా 37.2 ఎం.ఎం వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం దాకా ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో వంకలు వాగులు పొంగిపొర్లుతున్నాయి. మలపనగుడి, డి.హీరేహాళ్, ఓబులాపురం, పులకుర్తి, కాదలూరు, గొడిసెలపల్లి తదితర గ్రామాల్లో వర్షం పెద్ద ఎత్తున కురిసింది. రాత్రి కురిసిన వర్షానికి గొడిసెలపల్లి, ఏలంజి మధ్య వాగు ఉధృతంగా ప్రహించడంతో సుమారు మూడు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి.

విడపనకల్లులో దంచి కొట్టిన వాన

విడపనకల్లు: మండలంలో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. 79 ఎంఎం వర్షపాతం నమోదయ్యింది. పాలికి,పాల్తూరు నుంచి దర్గా హొన్నూరుకు వెళ్లే రోడ్డులోని పెద్ద వంక వరద నీటి ప్రవాహంతో పొంగిపొర్లింది. ఉండబండ, పాల్తూరు గ్రామాల మధ్య ఉన్న వంక వరద నీటితో పోటెత్తింది. పాలికి,హంచనహాల్ గ్రామాల మధ్య వరద నీటితో పంట పొలాలు కంది, మిరప, పత్తి, జొన్న, వరి పంటలు నీట మునిగాయి. పెద్ద కొట్టాలపల్లి, ఆర్.కొట్టాల, గడేకల్లు, గాజుల మల్లాపురం వంకలు వరద నీటితో పొంగిపొర్లాయి.

వజ్రకరూరు: మండల కేంద్రంలో బుధవారం రాత్రి భారీవర్షం కురిసింది. గ్రామంలోని కాలనీల్లో వర్షపునీరు పెద్ద ఎత్తున ప్రవహించింది. కాలనీల్లోని వర్షపునీరు మెయిన్‌రోడ్డు మీదుగా చెట్టుకుంటవైపు పారింది.



ఉద్దేహాళ్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వేదావతి హగరి నది



బొమ్మనహాళ్ : నీట మునిగిన వరి పంట



హంచనహాల్-పాలికి మధ్య పారుతున్న వంక



బెణికల్లు-ఎస్ఆర్ఎన్ క్యాంపు మధ్య వంక దాటేందుకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గొడిసెలపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



విడపనకల్లు: నీట మునిగిన పంట



పాల్తూరు వద్ద ఉధృతంగా పారుతున్న వంక



వీరాపురంలో రోడ్డుపై నేలకూలిన వృక్షం



రాయదుర్గం ఆర్అండ్‌బీ కార్యాలయం ఎదురుగా ఇలా...



మధుటాకీస్‌కు వెళ్లే దారిలో పేరుకుపోయిన బురద



పాల్తూరు-దర్గా హొన్నూరు రహదారిలో పొంగి పొర్లుతున్న పెద్ద వంక

వర్షబీభత్సం.. నీట మునిగిన పంటలు

ఉరవకొండ: నియోజకవర్గ వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. వివిధ రకాల పంటలు నీట మునిగాయి. పలు కాలనీల్లోకి నీరు చేరింది. బుధవారం అర్ధరాతి నుంచి వర్షం.. ఏకధాటిగా కురిసింది. 90 మి.మీల వర్షపాతం నమోదయ్యింది. స్థానిక బళ్లారి బైపాస్ వద్ద ఈశ్వరమ్మ ఆలయం వద్ద ఉన్న కాలనీల్లోకి భారీగా వరద నీరు చేరింది. శివరామిరెడ్డి కాలనీలోని పేదల గుడిసెల్లో వర్షపు నీరు చేరి నిత్యావసరాలు తడిసిపోయాయి. విడపనకల్లు మండలంలోని పాల్తూరు, ఉండబండ వంకలు ఉధృతంగా ప్రవహించడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వజ్రకరూరు మండలం హోతూరు, చాబాల, విడపనకల్లు మండలం పాలికిలో మిరప, కంది, వేరుశనగ పంటలు పూర్తిగా నీటమునిగాయి. ఉరవకొండలోని పలు చేనేత మగ్గం గుంతల్లో నీరు చేరడంతో చేనేత ముడి సరుకులు పూర్తిగా దెబ్బతిన్నాయి. తహసీల్దార్ మహబూబ్‌బాషా, అధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



ఉరవకొండ ఈశ్వరమ్మ ఆలయం వద్ద చేరిన వర్షపునీరు



ఉరవకొండ వద్ద వేరుశనగ పంటలోకి చేరిన నీరు



పాలికి గ్రామం వద్ద నీట మునిగిని మిరప పంట

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఏసీడీపీఓ ఎల్లమ్మ, కౌన్సిలర్ సంధ్య

కూడేరు: చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ సమితి కౌన్సిలర్ సంధ్య, ఏసీడీపీఓ ఎల్లమ్మ పిలుపునిచ్చారు. గురువారం కూడేరు కేజీబీవీలో ఐసీడీఎస్ పీడీ నాగమణి, సీడీపీఓ శ్రీదేవి ఆధ్వర్యంలో 'సంకల్ప' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బాల్య వివాహాల ద్వారా కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ ఉమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారుల హామీతో నిరహారదీక్ష విరమణ



సీపీఐ నేతలతో మాట్లాడుతున్న అధికారులు

కణేకల్లు: రెవెన్యూ అధికారుల హామీతో గత నాలుగు రోజుల నుంచి నిరహార దీక్ష చేస్తున్న సీపీఐ నాయకులు గురువారం దీక్ష విరమించారు. మండల కేంద్రంలో గతంలో ఇంటి స్థలాలిచ్చిన వారికి 3 సెంట్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కణేకల్లు మండల సీపీఐ కార్యదర్శి గౌస్‌పీర్ ఆధ్వర్యంలో సీపీఐ కార్యకర్తలు సోమవారం నుంచి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరహారదీక్ష చేపట్టారు. గురువారం డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్, ఆర్ఐ సందీప్, వీఆర్వో పవన్‌లు దీక్ష శిబిరానికి చేరుకొని వారి డిమాండ్లను తెలుసుకున్నారు. సమస్య పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో దీక్ష విరమించారు.

ఎస్సీ హాస్టల్ తనిఖీ



శెట్టూరులోని ఎస్సీ బాలుర వసతి గృహంలో భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీధర్

శెట్టూరు: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎంఈఓ శ్రీధర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఉదయం, సాయంత్రం భోజనాలకు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారు అనే విషయాలు ఆరా తీశారు. హాజరు రికార్డులు పరిశీలించారు. గుడ్లు ఇతర ఆహార పదార్థాలు విద్యార్థులకు అందుతున్నాయా? లేదా అన్న విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డన్ ధనుంజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నిరసన



రాయదుర్గంలోని బీజీ తిలక్ మున్సిపల్ హైస్కూల్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

రాయదుర్గంటౌన్: నియోజకవర్గ వ్యాప్తంగా ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు 'నిరసన వారం' కార్యక్రమం నిర్వహించారు. మొదటి రోజు గురువారం పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. వివిధ రూపాల్లో నిరసన వారం కార్యక్రమాన్ని 17 వరకు కొనసాగించనున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి టి.రామాంజనేయులు తెలిపారు. స్థానిక రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన నిరసన వారం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 17 వరకు జరిగే ఏపీటీఎఫ్ నిరసన వారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కరుట్లపల్లి చెరువులోకి కృష్ణా జలాలు



మరువ పారుతున్న కరుట్ల పల్లి చెరువు

కూడేరు: మండలంలోని కరుట్లపల్లి చెరువులోకి హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ ద్వారా జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలు కొద్ది రోజులుగా వచ్చి చేరుతున్నారు. చెరువు కృష్ణా జలాలతో నిండుగా కళకళలాడుతోంది. మరువ కూడా పారుతోంది. భూగర్భ జలాలు పెరిగి, వ్యవసాయ బోర్లలో నీటి లభ్యత పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

యువత లక్ష్యం నిర్దేశించుకోవాలి

రాయదుర్గంటౌన్: యువతకు నిర్దిష్టమైన లక్ష్యం అవసరమని, లక్ష్యం లేని జీవితం వ్యర్థమని శారదాదేవి జ్ఞాననిధి ట్రస్ట్ చైర్మన్ స్వామి అర్చనానంద తెలిపారు. గురువారం స్థానిక కళ్లీమఠం హైస్కూల్ వద్దనున్న శివరాకృష్ణ ధ్యానమందిరంలో శారదాదేవి ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 113వ చికాకో ఉపన్యాసాన్ని పురస్కరించుకుని స్కాలర్‌షిప్స్ పంపిణీ చేశారు. ట్రస్ట్ తరఫున రూ.2.20 లక్షల స్కాలర్‌షిప్స్‌ను ఎంబీబీఎస్, బీటెక్, ఫార్మాసి చదివే 28 మంది పేద విద్యార్థులకు దాతలతో కలిసి అందజేశారు. అర్చనానంద మాట్లాడుతూ యువతకు ఆత్మవిశ్వాసం, లక్ష్య సాధన ఉంటేనే ఎలాంటి రంగాల్లోనైనా రాణించవచ్చన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులకు స్కాలర్‌షిప్ అందిస్తున్న స్వామి అర్చనానంద, దాతలు

గర్భిణులు రక్తహీనత అధిగమించాలి

కూడేరు: గర్భిణులు రక్తహీనతను అధిగమించాలన్నదే స్వస్తిక్ సంస్థ ఉద్దేశమని బెంగళూరుకు చెందిన స్వస్తిక్ సంస్థ ప్రతినిధి శివసాయి పేర్కొన్నారు. గురువారం స్వస్తిక్ సంస్థ ప్రతినిధులు కూడేరు పీహెచ్‌సీని సందర్శించారు. విటమిన్ బి-12, ఐరన్, ఫోలిక్ యాసిడ్ వంటి పోషకాలు, సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల గర్భిణుల్లో రక్తహీనతను అధిగమించొచ్చన్నారు. రక్తహీనతను అధిగమించడానికి మీరేమి చర్యలు తీసుకుంటున్నారని పీహెచ్‌సీ సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యశోద, ఫార్మసిస్టు వేణుగోపాల్, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీవిద్య, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్వస్తిక్ సంస్థ ప్రతినిధులు

పూలకుంటలో నీటి ఎద్దడి



గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంటలో తాగునీటి ఎద్దడి నెలకొంది. నెల రోజులుగా తాగునీటి సమస్య వెంటాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ శాఖ అధికారులు గాని పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రజల అవసరాలకు తగ్గట్టుగా తాగునీరు అందక చుట్టుపక్కల వ్యవసాయ బోరుబావులను ఆశ్రయించి, నీటిని తీసుకురావాల్సిన అగత్యం నెలకొందని వారు ఏకరువు పెడుతున్నారు.

తాగునీరు అందించండి

కుందుర్పి: మండలంలో మూడు గ్రామ పంచాయతీలకు సత్యసాయి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సర్పంచులు రామ్మూర్తి, అతావుల్లా, ప్రభాకర్ తదితరులు ఎంపీడీఓ శంకర్‌కు గురువారం వినతిపత్రం అందించారు. 3 నెలలుగా సత్యసాయి తాగునీరు పైపంచాయతీలకు సరఫరా కావడంలేదన్నారు. శెట్టూరు మండలం చిన్నంపల్లి వద్ద వ్యవసాయ పొలంలో ప్రధాన పైప్ ధ్వంసం కాగా, పొలం యజమాని పైప్‌ను మరమ్మతులు చేయకుండా అడ్డుకుంటున్నట్లు సంస్థ కార్మికులు తెలిపారు.

యూరియా వాడకంపై అవగాహన



భూపసముద్రంలో యూరియా వాడకంపై అవగాహన కల్పిస్తున్న 'ఆత్మా' సంచాలకులు పద్మలత



కోరమాండ్ వద్ద యూరియా పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్ మునివేలు

గుమ్మఘట్ట: యూరియా అధికంగా వాడితే దుష్ప్రభావాలు ఉంటాయని ఆత్మా పథక సంచాలకులు పద్మలత అన్నారు. భూపసముద్రం, బేలోడు గ్రామాల్లోని రైతులకు యూరియా అధికంగా వాడకం వల్ల నష్టాలు, మేలైన వ్యవసాయ పద్ధతులపై తెలియజేశారు. వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు వాడాలన్నారు. అధికంగా వాడితే చీడపీడలు ఉధృతమై, నేలలో భౌతిక రసాయని లక్షణాలు పాడవుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి కె.లక్ష్మీ, నరసింహులు, రుమానా బేగం, మండల విస్తరణ అధికారి ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా పంపిణీ

బొమ్మనహాళ్: యూరియా కొరత లేదు..ప్రతి రైతుకూ పంపిణీ చేస్తామని తహసీల్దార్ మునివేలు తెలిపారు. గురువారం ఆర్ఎస్‌కేలు, కోరమాండల్‌లో యూరియా పంపిణీని పరిశీలించారు. నేడో, రేపో యూరియా సొసైటీలకు, రైతు సేవా కేంద్రాలకు, ప్రైవేట్ ఎరువుల దుకాణాలకు యూరియా సరఫరా చేస్తారని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

బెళుగుప్ప: మండలంలోని ఆవులెన్నలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్యాంసుందర్ రాజు, బ్రాహ్మణపల్లి తండా హెచ్ఎం వెంకటరమణప్ప ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను గురువారం సన్మానం చేశారు. ఉత్తమ విద్యాబోధన చేస్తున్న ఆవులెన్న గ్రామవాసి యు.శ్రీనివాసులు, వి.అర్జున్‌లను గ్రామస్తులు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు నారాయణస్వామి, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ టి.తిప్పేస్వామి, దుద్దేకుంట, ఎర్రగుడి హెచ్ఎంలు సురేష్, సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మన్న, వెంకటేశులు, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

జంబుగుంపల్లో అపరిశుభ్రత తొలగించండి

కుందుర్పి: జంబుగుంపలలో అపరిశుభ్రత తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో నెలలతరబడి అపరిశుభ్రంగా ఉండడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారని గ్రామస్తులు ఆంజనేయులు, లక్ష్మీదేవి, తిప్పేస్వామి తదితరులు తెలిపారు. పాఠశాల ముందు మరుగునీరు ఉండడంతో విద్యార్థులు పాఠశాలలోకి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని ఉపాధ్యాయులు తెలిపారు.



ప్రాథమిక పాఠశాల ముందు పారుతున్న మురుగు

నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

వజ్రకరూరు: మండలంలోని తట్రకల్లు సమీపంలోని ఉరవకొండ-గుంతకల్లు ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సు ఆగిపోయింది. గుంతకల్లు డిపో బస్సు బుధవారం అనంతపురంలో జరిగిన సూపర్‌హిట్ సభకు వెళ్లి గురువారం తెల్లవారుజామున తిరిగి బయల్దేరింది. ఉరవకొండ నుంచి గుంతకల్లుకు వెళ్తుండగా మార్గంమధ్యలో తట్రకల్లు వద్ద సాంకేతిక లోపం తలెత్తి అక్కడే ఆగిపోయింది.



తట్రకల్లు వద్ద ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

కళ్యాణదుర్గం రూరల్: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రీడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్ తెలిపారు. గురువారం పట్టణంలోని మోడల్ స్కూల్‌ల్లోని విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్, టీబీ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మజదేవి, కిరణ్, ఏఎన్ఎం వరలక్ష్మి, రీడ్స్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.